సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం : 26 : జూలై : 2025



టీడీపీ నాయకుడి దౌర్జన్యం

కౌలుకు ఇచ్చిన చిన్నాన్న భూమిని ఆక్రమించుకోవడమేగాక... ఆ భూమి తనదేనంటూ చిన్నాన్న, చెల్లెళ్లపై దౌర్జన్యం చేసిన టీడీపీ నాయకుడి ఉదంతం వెలుగులోకి వచ్చింది. -8లో



ఆరా యాప్.. అంతా డూప్

ఆరా యాప్ పేరు వినగానే బాధితులకు గుండె గుబేల్‌మంటోంది.గ్లోబల్ డిజిటల్ యాడ్స్ ఫ్లాట్‌ఫాంగా వచ్చిన యాప్ నిర్వాహకులు ఆశ చూపి స్కాంకు పాల్పడ్డారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.450
రెండోరకం	రూ.200	రూ.360



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 395 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీజీ	653	653
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 64.440 కిలోలు

న్యూస్‌రీల్

ఇంటర్ ఆర్‌జేడీగా సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ విద్యామండలి కడప ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా కర్నూలు జిల్లా డీఐఈఓగా పని చేస్తున్న సురేష్‌బాబును నియమిస్తూ ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కడప ఆర్‌జేడీగా పని చేస్తున్న శ్రీనివాసులు జూన్ 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందారు. దీంతో కడప ఆర్‌జేడీగా కర్నూలు జిల్లా డీఐఈఓగా పని చేస్తున్న సురేష్‌బాబును నియమించారు. ఆయన నేడో, రేపు బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

జమ్మలమడుగు: ఆగస్టు 1న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం పర్యటనకు వస్తున్నారని సమాచారం రావడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ శ్రీధర్ చెరకూరి పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో కొన్ని ప్రాంతాలతోపాటు పాలిటెక్నికల్ కాలేజీని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ నిర్మాణం,బహిరంగ సభకు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సమావేశానికి పత్రికా విలేకరులను ఎవ్వరిని అనుమతించలేదు.

పది కుటుంబాలు దత్తత తీసుకున్న కలెక్టర్, జేసీ

రాయచోటి: పి–4 కార్యక్రమంలో భాగంగా పది బంగారు కుటుంబాలను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, మరో పది కుటుంబాలను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌లు దత్తత తీసుకుని మార్గదర్శులుగా నిలిచారు. శుక్రవారం అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, ఇతర ప్రజా ప్రతినిధులతో పి–4 కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్గదర్శకులను బంగారు కుటుంబాలతో లింక్ చేసి బంగారు కుటుంబాలకు మార్గదర్శి చేయూత ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడేలా చేయాలన్నారు. జిల్లాలోని జిల్లా అధికారులందరూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని సీపీఓకు సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ మధుసూదనరావు, సీపీఓ వెంకట్, డొనేట్ కార్డు సీఈఓ అనీల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ లక్ష్మీనరసయ్య

పెద్దతిప్పసముద్రం: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చొరవ చూపాలని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య మెడికల్ ఆఫీసర్ ఎండీ యస్తాని, శంకర్‌లకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలోని ఆరోగ్య, ఉప కేంద్రాలు, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే సిబ్బంది పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మురికి నీటి నిల్వ వల్ల కలిగే దుష్ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీఎల్‌టీవో డాక్టర్ రమేష్, డీఎంవో శ్రీధర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి



కోర్టు గేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న న్యాయవాదులు

రాయచోటి టౌన్: భారత న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఎల్‌ఏ)ఉమ్మడి కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి కోర్టు గేట్ ఐఎల్‌ఏ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. న్యాయవాదులపై కక్ష పెంచుకొని వివిధ రూపాలలో దాడులకు తెగబడుతున్నారన్నారు. దీని కోసం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కోర్టులో మహిళ న్యాయవాదులకు ప్రత్యేక విశ్రాంతి గదులను ఏర్పాటు చేయలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన న్యాయవాదులకు ప్రభుత్వం, బార్ కౌన్సిల్ కలిపి ఇస్తున్న రూ.10లక్షలకు బదులుగా రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఏఎల్ కడప ఉమ్మడి జిల్లా నాయకులు రాజగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగభూషణం, యు.ధనుంజయ్ కుమార్, సీనియర్ న్యాయవాదులు రాజకుమార్ రాజు, సహాయక కార్యదర్శి ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

కోతలు.. ఆపై కూతలు!

- 2024జూన్‌లో జిల్లాలో 2,23,436 పింఛన్లు
- 2025 ఫిబ్రవరి నుంచి జూలై వరకు 41,286 పింఛన్ల కోత
- వీటి విలువ రూ.16.51 కోట్లు
- జూలైలో 8,4.08 పింఛన్ల తగ్గుదల
- నవంబర్ నుంచి కొత్తగా 2,020 ఇచ్చినట్లు కూటమి కోతలు
- కలికిరికి మాత్రమే 1,732 పెంచారు
- మంత్రి మండిపల్లి నియోజకవర్గంలో ఒక్కటీ పెరగలేదు



మదనపల్లె: ఏ ప్రభుత్వమైనా పేదలకు అందించే సామాజిక భద్రత పథకాలపై విశాల దృక్పథంతో వ్యవహరించాలి. అందులోనూ సామాజిక పింఛన్ల విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలి. ఆయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన అందరికి నిరంతరంగా కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ ఆర్థిక భరోసాను కల్పించింది. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అన్నమయ్య జిల్లాలో పింఛన్లకు కష్ట కాలమొచ్చింది. జూన్ పింఛన్ల సంఖ్యను యాథావిధిగా కొనసాగించి జూలైలో అవే పింఛన్లు ఇచ్చిన ప్రభుత్వం అగస్టు నుంచి కోతలు మొదలుపెట్టింది. ఆ ఒక్కనెలతో సరిపెట్టని ప్రభుత్వం ప్రతినెలా కోతలు విధిస్తూ వస్తోంది.ఆ కోతల సంఖ్య వందల్లోంచి ఏకంగా వేలల్లోకి చేరింది. ఫలితంగా పేదలు, తోడు–నీడ లే ని వాళ్లకు, మంచానపడిన వాళ్లు, అనారోగ్యం బారిన పడిన వాళ్లు అభద్రతా భావానికి గురవుతున్నారు.

కోతలే కోతలు

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండి పంపిణీ చేసిన చివరినెల 2024 జూన్‌లో జిల్లాలో 2,23,436 పింఛన్లు (అన్ని రకాలు) మంజూరు చేశారు. ఇదేనెలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో జూలై నెల పింఛన్లను యథావిధిగా కొనసాగించి పంపిణీ చేశారు. ఆగస్టు నుంచి పింఛన్ల మంజూరులో కోతలు మొదలయ్యాయి. 2,23,436 పింఛన్ల సంఖ్యను పెంచాల్సిన ప్రభుత్వం 1,123 పింఛన్లకు కోతవేసి 2,22,313 మందికి పంపిణీ చేసింది. ఇక ప్రతినెలా కోతల్లో వెనుదిరిగి చూసుకోలేదు. 2025 ఫిబ్రవరిలో 2,18,115 పింఛన్లను తగ్గగా జూన్‌లో 2,15,650కి తగ్గించారు. అదికాస్త జూలైలో 2,15,028కు పడిపోయి..2024 జూన్ పింఛన్ల సంఖ్యలో 2025 జూలై పింఛన్లలో 8,408 పింఛన్ల కోత పడింది. ఇది ఒకనెలలో తగ్గిన సంఖ్య మాత్రమే.

పింఛన్ల తగ్గుదల ఇలా

నెల	పింఛన్లు	తగ్గినవి
2024 జూన్	2,23,436	–
2024 ఆగస్టు	2,22,313	1,123
2025 ఫిబ్రవరి	2,18,151	5,285
మార్చి	2,17,388	6,048
ఏప్రిల్	2,16,821	6,615
మే	2,16,292	7,144
జూన్	2,15,650	7,786
జూలై	2,15,028	8,040

ఆరు మాసాల్లో..

తగ్గించుకుంటూ వస్తున్న పింఛన్ల సంఖ్య గడచిన ఆరునెలల వివరాలు పరిశీలిస్తే..ఆశ్చర్యకరంగా 41,286 మందికి అందలేదు. ఇది ఆరు మాసాల్లో తగ్గిన మొత్తం కలిపితే పింఛన్ల సంఖ్య. అంటే జిల్లాకు చెందిన పేదలు ఏస్థాయిలో ఆర్థిక భరోసా కోల్పోయారో దీన్నిబట్టి స్పష్టంగా ఆర్థమవుతుంది. ఈ మొత్తం పింఛన్లలో సగటు పింఛన్ రూ.4వేలతో లెక్కించినా రూ.16.51 కోట్ల ఆర్థిక ఆసరాను పేదలు నష్టపోయారు. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ ఎదురుకాలేదని పింఛన్‌దారులు అంటున్నారు.



జిల్లాలో పింఛన్ల కోత అప్రతిహతంగా కొనసాగుతుంటే ప్రభుత్వం కొత్తగా ఇచ్చినట్లు కూతలు కూస్తోంది. ఏడాదికాలంగా భర్తలు చనిపోయిన భార్యలు తమకు పింఛన్లు మంజూరు చేయాలని విన్నవిస్తూ వస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేశారు. కూటమి అధికారంలోకి రాగానే వీటి సమాచారం గల్లంతైంది. వెబ్‌సైట్‌లో వివరాల జాడలేదు. దీనితో కూటమి ప్రభుత్వం తీరిగ్గా ఈ ఏడాది ఏప్రిల్‌లో పింఛన్లు పొందుతూ చనిపోయిన భర్తల స్థానంలో భార్యలకు పింఛన్లు ఇచ్చేందుకు ఆదేశాలు ఇచ్చారు. దీనితో దరఖాస్తులు చేసుకున్న 5,134 మంది భార్యలకు పింఛన్లు మంజూరు చేయాల్సి ఉండగా అందులో 4,620 మంది అర్హులుగా తేల్చారు. అయితే గత నవంబర్‌లోనే 2,020 మందికి పింఛను మంజూరైనట్టు డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ శుక్రవారం చెప్పారు. మిగిలిన 2,600 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేయనుందని పీడీ వివరించారు. పింఛన్లు మంజూరు చేసినా సంఖ్య ఎందుకు పెరగలేదో ప్రభుత్వానికే తెలియాలి.

కొత్తగా ఇచ్చారట

కలికిరి ప్రత్యేకమా

జిల్లాలోని 30 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలు ఉండగా ఒక్క కలికిరి మండలానికి మాత్రమే పింఛన్లు పెరిగాయి. ఈ మండలంలో 2024 ఆగస్టులో 5,111 పింఛన్లు ఉండగా ఈ జూలైలో ఒక్కసారిగా 6,843కు పెరిగాయి. ఇది ఎలా సాధ్యమైందో అధికారులకే తెలియాలి. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గం రాయచోటిలోనూ ఒక్క పింఛన్ పెరగకపోగా కోతకు గురయ్యాయి. అలాంటప్పుడు అధికారులు కలికిరిని మాత్రమే ప్రత్యేకంగా చూస్తున్నాం అని చెప్పకనే చెప్పారు. దీనితో జిల్లా మొత్తానికి మొండి చెయ్యి చూపి కలికిరి మండలానికి మాత్రమే కొత్త పింఛన్లు ఇవ్వడం ఏమిటో అధికారులే చెప్పాలి.

మండలాల్లో తగ్గిన పింఛన్ల వివరాలు

మండలం	2024 అగస్టు	2025 జూలై
రామాపురం	5,127	4,953
లక్కిరెడ్డిపల్లె	4,660	4,511
నిమ్మనపల్లె	5,116	4,991
రామసముద్రం	6,508	6,315
కలికిరి	5,111	6,843
చిట్వేలి	5,718	5,471
రాజంపేట్	7,622	7,375
ఓబులవారిపల్లె	6,461	6,204
రాయచోటి	4,713	4,595
రాజంపేట్ పట్టణం	3,276	3,121
టి.సుండుపల్లె	7,797	7,525
పెనగలూరు	5,169	4,972
సంబేపల్లి	5,716	5,554
వాయల్పాడు	6,886	6,635
ములకలచెరువు	6,729	6,527
గాలివీడు	7,177	6,946
వీరబల్లి	5,375	5,187
కురబలకోట	6,512	6,316
మదనపల్లె పట్టణం	11,064	10,688
చిన్నమండెం	5,151	4,957
రాయచోటి పట్టణం	8,433	8,188
కేవీపల్లె	6,968	6,715
కోడూరు	10,299	9,913
బి.కొత్తకోట	7,967	7,708
నందలూర్	4,109	3,952
తంబళ్లపల్లె	6,265	6,047
కలకడ	5,551	5,358
పెద్దతిప్పసముద్రం	8,006	7,763
గుర్రంకొండ	6,105	5,912
పెద్దమండ్యం	5,589	5,377
మదనపల్లె	14,208	13,924
పీలేరు	9,842	9,569

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ బాబు

రాయచోటి: ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది, ఎంతో పవిత్రమైందని రాయచోటి డైట్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం డైట్ కళాశాల సభా భవనంలో రెండు సంవత్సరాల డీఈఎల్‌ఈడీ కోర్సు ప్రారంభోపన్యాసం చేశారు. రాయలసీమలోని నాలుగు జిల్లాల నుంచి హాజరైన ఉపాధ్యాయ శిక్షణలో ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలో గురువు స్థానం చాలా గొప్పదన్నారు. సమాజ నిర్మాణం ఒక మంచి ఉపాధ్యాయుని చేతిలో ఉందన్నారు. మనం తయారు చేసే విద్యార్థులు రేపటి నాయకులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, సైనికులు, మానవతావాదులు కావచ్చని తెలిపారు. డైట్ లాంటి ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో పనిచేయడం గౌరవప్రదమైన విషయమన్నారు. మంచి విలువలు, సానుకూల దృక్పథం, విద్యపట్ల శ్రద్ధ మనలో ఉంటే సమాజాన్ని మార్చుకోవచ్చన్నారు. డైట్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ వై గిరిబాబు యాదవ్ మాట్లాడుతూ బోధన అనేది కేవలం పాఠాలు చెప్పడం మాత్రమే కాదని, విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దే పరిశుద్ధమైన సేవ లాంటిదన్నారు. ఉపాధ్యాయుడిగా మనం విద్యార్థులలో ఆసక్తిని రేకెత్తించాలని పేర్కొన్నారు. లెక్చరర్లు శివ భాస్కర్,రెడ్డప్పరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, కేదార్‌నాథ్, టి శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్, లెక్చరర్లు ఉషారాణి, వంద మందికి పైగా నూతనంగా ప్రవేశించిన ఛాత్రోపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శిక్షణలో ఛాత్రోపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు

వంద శాతం చెత్త సేకరణ జరగాలి

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ములకలచెరువు: పంచాయతీ పరిధిలో 100 శాతం చెత్త సేకరణ జరగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వేపూరికోటలోని వ్యర్థ పదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్రంలోకి తడి చెత్త, పొడిచెత్త ను వేరు చేసి తరలించాలని తెలిపారు. పంచాయతీలోని ప్రతి కుటుంబం నుంచి చెత్తను సేకరించడానికి అవసరమ య్యే గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంబాసిడర్ల ఖాళీలను సైతం భర్తీ చేసుకొని 100 శాతం చెత్త సేకరణ జరగాలని ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వీటి ద్వారా సంపద సృష్టించి పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ బాధ్యత మరవని డ్రైవర్

- ప్రయాణికులను కాపాడి.... గుండెపోటుతో మృతి
- స్టీరింగ్‌పై కుప్పకూలిన డ్రైవర్



కావలి నుంచి నెల్లూరుకు వెళ్తున్న బస్సు



రసూల్ (ఫైల్)



మార్చురీలో రసూల్ మృతదేహం

రాయచోటి టౌన్: బస్సు నడుపుతూ ఓ డ్రైవర్ స్టీరింగ్‌పైనే కుప్పకూలిపోయాడు. తనకు గుండెపోటు రావడంతో అప్రమత్తమై బస్సును నిలిపివేసి ప్రయాణికులను ప్రమాదం నుంచి తప్పించాడు. తన ప్రాణాలు పోతున్నా.. అందరినీ రక్షించి ప్రాణదాతగా నిలిచాడు. అతడే డ్రైవర్ షేక్ రసూల్. ట్రాఫిక్ పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ షేక్ రసూల్ (55) కావలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నడుపుకొంటూ శుక్రవారం తెల్లవారు జామున మూడు గంటల సమయానికి అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి చేరుకున్నారు. రాయచోటి నుంచి బెంగుళూరుకు వెళ్లే సమయంలో మార్గమధ్యంలో మదనపల్లె రోడ్డు సమీపంలో అకస్మాత్తుగా గుండెలో నొప్పి రావడం ఆరంభమైంది. అప్రమత్తమైన అతడు.. వెంటనే రాయచోటి పట్టణం సమీపంలోని ఓ డివైడర్‌కు బస్సు తగిలించి ఆపేశాడు. అనంతరం గుండెపోటుతో స్టీరింగ్ పైనే కుప్పకూలిపోయాడు. ఆ సమయంలో బస్సులో ఉన్న కండక్టర్, మరో నలుగురికి ప్రమాదం తప్పింది. ఈ విషయం ప్రయాణికులు స్థానికుల సహకారంతో పోలీసులకు తెలియజేయడంతో ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో వచ్చి డ్రైవర్ సీట్‌లో మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ సాగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గండి క్షేత్రం.. సప్తవర్ణ శోభితం

- నేడు తొలి శనివారోత్సవం
- భారీగా తరలిరానున్న భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు



విద్యుద్దీపాలంకరణలో కాంతులు లీనుతున్న గండి క్షేత్రం



గండి వీరాంజనేయస్వామి మూలవిరాట్

చక్రాయపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి విద్యుత్ వెలుగులతో విరాజిల్లుతోంది. మిరుమిట్లు గొలిపే దీప కాంతులు మైమరిపిస్తున్నాయి. గండిలో శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నేడు తొలి శ్రావణ మాస శనివారోత్సవం జరగనుంది. ఇందుకోసం ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆవరణలో పలు దేవతా మూర్తుల డిజిటల్ కటౌట్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆలయం సప్తవర్ణ శోభితంతో ప్రకాశిస్తోంది. శ్రీవీరాంజనేయస్వామి దర్శనం కోసం భక్తులు భారీగా తరలిరానున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. రాత్రి భక్తుల కాలక్షేప నిమిత్తం హరికథలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు చెప్పారు.

ప్రత్యేక అలంకరణ

శ్రావణ మాస శనివారం సందర్భంగా మూలవర్లుకు ప్రత్యేక పూల అలంకరణ చేస్తున్నట్లు ఆలయ ప్రధాన, ఉపప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్ తెలిపారు. శ్రావణ శనివారాల్లో ఎలాంటి అభిషేకాలు, వాహన పూజలు ఉండవని వారు చెప్పారు. శనివారం ఉదయం 3.30 నుంచి 4 గంటల వరకు సుప్రభాతం, 4 నుంచి 4.30 వరకు అభిషేకం, 4.30 నుంచి 5 వరకు అలంకరణ, అనంతరం భక్తులకు స్వామి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మహానైవేద్యం, మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

పటిష్ట బందోబస్తు

ఉత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్సై రంగారావు తెలిపారు. తొలి శనివారం సందర్భంగా ముగ్గురు ఎస్సైలు, 90 మంది పోలీసులను బందోబస్తుకు నియమించడం జరిగిందన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేడతామని చెప్పారు. భక్తుల రద్దీని బట్టి ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని చెప్పారు. ఉత్సవాల ప్రశాంత నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



కొత్తపల్లిలో మామిడి చెట్టు కొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న ఉద్యానశాఖ డీడీ సుహాసిని

రాయచోటి: మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు జిల్లా ఉద్యానశాఖ డీడీ ఎస్ఎస్‌వి సుహాసిని సూచించారు. మామిడి చెట్లలో కాయలను దాదాపు కోసివేయాలన్నారు. తోట నుంచి పూర్తిగా కాయలను తొలగించిన తరువాత ఒకసారి నీటి తడిని అందించాలన్నారు. అనంతరం చెట్లను ఎండు పుల్లలు, పోతు కాడలు, ఆకు గూళ్లను తొలగించాలన్నారు. చెట్టు మధ్యభాగంలో ఉన్న చిన్న కొమ్మలు, క్రిందకు వేలాడేవాటిని కత్తిరించాలని తెలిపారు. తొలకరి వర్షాల సమయంలో చెట్టు మొదలు దగ్గరగా భూమిని దున్నడం లేదా పాదుల తవ్వి మట్టిని తిరగేయాలని చెప్పారు. ఈ మాసంలో ఎకరాకు పది కిలోల జీలుగ, 25 కిలోల జనుము లాంటి పచ్చిరొట్ట పైర్లు వేసి 40 నుంచి 45 రోజుల లోపు బాగా కలయదున్నాలన్నారు. ఇలా చేయడం వల్ల సేంద్రియ పదార్థం భూసారంగా మారుతుందన్నారు. కొత్త చిగురు వచ్చే సమయంలో ఐదు గ్రామాల జింక్ సల్ఫేట్, 2గ్రాముల బోరాక్స్, 10గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకుంటే వచ్చే ఏడాది మంచి దిగుబడులు పొందవచ్చని సుహాసిని రైతులకు తెలియజేశారు.

క్లుప్తంగా

ప్లేస్‌మెంట్ వ్యూహాలు కెరీర్ విజయానికి కీలకం



మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో మాట్లాడుతున్న మోదీన్ రశీష్

కురబలకోట : ప్లేస్‌మెంట్ వ్యూహాలు కెరీర్ విజయానికి కీలకమని టాలెంట్ ఉన్న వారికి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందని పుణెలోని అరిష్ట నెట్‌వర్క్స్ ఇండియా క్లౌడ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు మోదీన్ రశీష్ అన్నారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో రియల్ వరల్డ్ ప్లేస్‌మెంట్ స్ట్రాటజీస్ ఫర్ సక్సెస్ అంశంపై శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువు పూర్తయ్యాక జాబ్ ఇంటర్వ్యూలకు వెళ్లే ముందు ప్రత్యేక నైపుణ్యాలు అవసరమన్నారు. ముందుగా కంపెనీ సమాచారాన్ని అధ్యయనం చేసి ఉండాలన్నారు. ప్రశ్నలకు తడబడకుండా సమాధానాలు చెప్పాలన్నారు. ఇందుకు సబ్జక్టుపై పట్టు ఉండాలన్నారు. బాడీ లాంగ్వేజ్ కూడా ముఖ్యమన్నారు. ముఖ్యంగా రెజ్యూమ్ అనేది పకడ్బందీగా ఉండాలన్నారు. ఇది అవకాశాలను తెరిచే తాళం లాంటిదని గుర్తించాలన్నారు.

వేరుశనగ సాగులో అనుబంధ పంటలు



పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : వేరుశనగ సాగులో అనుబంధ పంటలుగా మొక్కజొన్న, జొన్న, సజ్జ, తదితర పంటలను సాగుచేయాలని డీపీఎం వెంకటమోహన్ సూచించారు. పీఎండీఎస్(ప్రీ మాన్‌సూన్ డ్రైయింగ్ సూయింగ్) సీజన్‌లో భాగంగా రాయచోటి మండలం బొట్లచెరువు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వేరుశనగ పొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పొలాలు, ఆర్ఎస్‌కె పరిధిలోని వీఏఏ, వీహెచ్ఏలతో కలిసి పరిశీలించామని, క్షేత్రస్థాయిలో రైతులకు మెలకువలు సూచిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నరెడ్డెన్న, హరిబాబు, అధికారులు పాల్గొన్నారు.

మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజున శుక్రవారం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలి ఇన్నింగ్స్‌లో 59.2 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఆదినారాయణ రెడ్డి 30 పరుగులు, కిరణ్ కుమార్ 31 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని యూహాస్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీయగా, వివేక్ 2 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 29 ఓవర్లకు ఆరు వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ గౌడ్ 19, కెవీ.ఓంకార్ 18 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని సంతోష్ రెండు, టి.కిరణ్‌కుమార్ రెండు వికెట్లు తీశారు. దీంతో తొలిరోజున ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో చిత్తూరు-నెల్లూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలి ఇన్నింగ్స్‌లో 76.3 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని హర్ష 88 పరుగులు, మహ్మద్ షారుఖ్ అక్తర్ 60 పరుగులు, విజె నోయల్ 58 పరుగులు చేశారు. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 70 పరుగులు చేసింది.


ఆరా యాప్.. అంతా డూప్..!

ఆరా యాప్ పేరు వినగానే బాధితులకు గుండె గుబేల్‌మంటోంది. తక్కువ టైమ్‌లో ఎక్కువ డబ్బులు వస్తాయంటే ఎవ్వరైనా ఆశ పడతారు. ఈ బలహీనత మోసగాళ్లకు అవకాశంగా మారుతోంది. ఆర్థిక అనిశ్చితి, ఆశ కారణంగా ఇలాంటి వాటిపై మక్కువచూపుతూ మోసపోవడం మరో కారణం.

- డిజిటల్ యాడ్స్ ప్లాట్‌ఫాం అంటూ మోసం
- ఈజీ మనీ పేరుతో మోసపోయిన జనం



ఆరా యాప్ గ్లోబల్ సినీ యాడ్స్ టాస్కులు



ఆరా ఐడీ ఓపెన్ చేస్తే ప్లీస్ కాంటాక్ట్‌ది హైరింగ్ మేనేజర్ అని ఇలా మెసేజ్

కురబలకోట : గ్లోబల్ డిజిటల్ యాడ్స్ ప్లాట్‌ఫాంగా వచ్చిన ఆరా యాప్ నిర్వాహకులు కొందరికి డబ్బు ఆశ చూపి భారీ స్కాంకు పాల్పడ్డారు. స్మార్ట్ ఫోన్‌లో రోజూ వచ్చే గ్లోబల్ సినీ యాడ్స్ టాస్కులు 15 సెకండ్ల చొప్పున చూస్తే డబ్బులు వస్తాయని ఎర వేశారు. ఈ వలలో చిక్కిన పలువురు మోసపోయారు. తంబళ్లపల్లె, కురబలకోట, మదనపల్లె, వాల్మీకిపురం పరిసర ప్రాంతాల బాధితుల కథనం మేరకు..ఆరా ఎర్నింగ్ యాప్ ఆరు నెలలుగా ఎక్కువగా ప్రచారంలోకి వచ్చింది. మొబైల్‌లో యాప్ ద్వారా నిర్దేశిత మొత్తం డిపాజిట్ చేస్తే వారానికోసారి డబ్బు వస్తుందని పేదలకు ఆశ చూపారు. వీ వన్ కింద రూ.2వేలు, వీ టు కింద రూ.4500, వీ త్రీ కింద రూ.20 వేలు, వీ ఫోర్ కింద రూ.65 వేలు ఇలా వీ నైన్ వరకూ డిపాజిట్ చేసుకునే అవకాశం కల్పించారు. డిపాజిట్ స్థాయిని బట్టి రోజుకు ఐదు టాస్కుల నుంచి గరిష్టంగా 200 టాస్కుల వరకు యాప్‌లో యాడ్స్ చూడాలి. ఎంత మొత్తం డిపాజిట్టు చేసినా అది ఒక నెలలో వచ్చేలా ఆశ కల్పించారు. ఒక టాస్క్ చూస్తే రోజుకు రూ.10 నుండి గరిష్టంగా రూ.790 వరకు నగదు వచ్చేలా టాస్కులు రూపొందించారు. అత్యాశపరులు తక్కువ రోజుల్లో ఎక్కువ సంపాదించవచ్చన్న ఆశతో డబ్బు డిపాజిట్ చేసి టాస్కులు చూడసాగారు. వీరి ఐడీ కింద మరింత మందిని జాయిన్ చేస్తే ఇంకా ఎక్కువ డబ్బు వస్తుందని ఆశ కల్పించారు. స్పిన్ గిఫ్ట్ కూడా పెట్టారు. అంతేగాక ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, టూవీలర్లు, కార్లు గిఫ్ట్‌గా ఇస్తామని మరిన్ని ఆశలను రేకెత్తించారు. మొదట్లో కొన్నాళ్ల నమ్మకం కల్గించడానికి డబ్బు వారి ఖాతాలకు జమ చేశారు. దీంతో మరింత మంది ఇందులో చేరారు. చెల్లించిన మొత్తం సొమ్ము ఒక నెలలో వచ్చేస్తుండడం .. ఆతర్వాత వచ్చేదంతా ఆదాయమేననే ఆశతో పలువురు ఇందులో చేరారు. వారు ఎంచుకున్న ప్లాన్ బట్టి గురు లేదా శుక్రవారం డబ్బు బ్యాంకు ఖాతాకు చేరుతుందని నమ్మించారు. ముందు చేరిన వారికి కనక వర్షమే కురిసింది. వెనుక చేరిన వారు నష్టపోవాల్సి వచ్చింది. రెండు వారాలుగా డబ్బు విత్ డ్రా కాలేదు. పైగా యాప్ ఓపెన్ కాలేదు. ఐడీ యాక్టివ్ చేసుకోవాలని సరికొత్త నిబంధన విధించారు. అప్పటికీ ఆశ చావని వారు అదనంగా డబ్బు చెల్లించి యాక్టివేట్ చేసుకున్నారు. శుక్రవారం విత్ డ్రా చేసుకోడానికి ఐడీ ఓపెన్ చేస్తే మళ్లీ సరికొత్త నిబంధన విధించారు. ×ప్లీస్ కాంటాక్ట్ ది హైరింగ్ మేనేజర్ ।అని వస్తుండడంతో యూజర్లు మరింత షాక్‌కు గురై దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆరా యాప్ మోసం గ్యారంటీ అని నిర్ధారణకు వచ్చారు. గతంలో కూడా దేశంలో ఢిల్లీ, కర్నాటక, కేరళ తదితర రాష్ట్రాల్లో ఆరా లాంటి టాస్క్ ఆధారిత ఇన్‌కమ్ స్కామ్స్‌తో బాధితులు కోట్లలో నష్టపోయిన సంఘటనలు వెలుగు చూశాయి. ఆరా యాప్ మోసంతో చేసేది లే క పోలీస్ స్టేషన్లకు బాధితులు వరుస కడుతున్నారు. నిర్వాహకులు ఎవరు..ఎక్కడుంటారన్నది తెలియని పరిస్థితి. గాలిలో దీపంలా బాధితులు పరిస్థితి మారింది. ఈ ఘరానా మోసంపై విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

ప్రధాన రహదారుల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు

- పీఎం ఈ-డ్రైవ్ పథకానికి రూ.2 వేల కోట్లు
- రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి



రాజంపేట : ఏపీలో అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాలు, ప్రధాన రహదారుల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లను ప్రణాళికబద్ధంగా ఏర్పాటుచేస్తామని భారీ పరిశ్రమల సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు వాహనాల కోసం ఫేమ్ పథకం కింద ఈవీసీఎస్‌లు తీసుకురానున్నట్లు చెప్పారన్నారు. ఇప్పటికే 494 ఫాస్ట్ ఈవీసీఎస్‌లు ఏర్పాటయ్యాయని, జూలై 1 నాటికి వాటిలో 95 అందుబాటులో వచ్చాయని కేంద్ర మంత్రి తెలిపారన్నారు. ఈవీసీఎల్ అభివృద్ధికి రూ.100 0కోట్లు కేటాయించాని, ఇప్పటికే రూ.912.50కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈవీసీఎస్‌లను మరింత వేగవంతం చేయడానికి పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద కేంద్రం రూ.2 వేల కోట్లు కేటాయించిందన్నారు. ఏపీలో పబ్లిక్ ఈవీ చార్జింగ్ మౌలిక సదుపాయాల విస్తరణను వేగవంతం చేయడమే లక్ష్యంగా పాన్ ఇండియా పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద కేంద్ర మంత్రిత్వ శాఖ, అధికారులు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థలు, వాటి ప్రమేయం ద్వారా అమలుచేయడం జరుగుతుందని మంత్రి నుంచి జవాబు వచ్చిందని మేడా తెలియచేశారు.

లోకాయుక్త ఆదేశాలతో క్వారీ పరిశీలన

నిబంధనల ఉల్లంఘనపై విచారణకు కలెక్టర్ ఆదేశం

పెద్దతిప్పసముద్రం : గ్రానైట్ క్వారీతో తాము నష్టపోతున్నామని ఓ బాధితుడి లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో పరిశీలనకు అధికారులు కదిలారు. బాధితుడి వివరాల మేరకు.. మండలంలోని గుడ్డంపల్లి సమీపంలోని తన పట్టా భూమిని గ్రానైట్ క్వారీ యాజమానులు ఆక్రమించడమేగాక.. ప్రభుత్వ నిభంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ పులికల్లుకు చెందిన తలారి ఉత్తన్న 2023 జూలై, 10న లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. భూ ఆక్రమణతో పాటు సదరు క్వారీ నుంచి వచ్చే భయంకరమైన శబ్దాలతో గృహాలు, సమీపంలోని పాఠశాలలు బీటలు వారుతున్నాయని, పక్కనే ఉన్న వ్యవసాయ బోర్లు కదులుతున్నాయని, పొలాల్లో బండరాళ్లు పడుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బాధితుడి ఆరోపణలపై సమగ్రమైన నివేదిక అందజేయాలని లోకాయుక్త కార్యాలయం నుంచి కలెక్టర్‌కు ఆదేశాలందాయి. ఆయన ఆదేశాల మేరకు మైన్స్ ఏడీ రంగకుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీ నరసయ్య, డీఎల్‌టీవో డాక్టర్ రమేష్, డీఎంవో శ్రీధర్, సీఎంఒ కరుణాకర్, తహశీల్దార్ శ్రీరాములు నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, డాక్టర్ శంకర్, ఎస్ఐ హరిహర ప్రసాద్, ఏవో ప్రేమలత, మండల సర్వేయర్ శ్రీవాణి, తదితరులు స్థానిక సర్పంచ్ గిరీష్, గ్రామస్థులతో కలిసి శుక్రవారం క్వారీ వద్దకు చేరుకున్నారు. 2006 నుంచి 2026 వరకు హెక్టార్ భూమిలో క్వారీకి అనుమతులున్నట్లు అధికారులు గుర్తించారు. మైన్స్ ఏడీ మాట్లాడుతూ అధికారిక అనుమతులతో క్వారీ నడుస్తోందని, ప్రభుత్వానికి శిస్తు జమ చేయకుంటే క్వారీని నిలిపివేయగా, మళ్లీ లీజు పునరుద్ధరించుకున్నారని ఫిర్యాదుదారుడి ఎదుట వెల్లడించారు. బాధితుడు మాట్లాడుతూ తమ భూమి ఎందుకు ఆక్రమించారని ప్రశ్నించినందుకు క్వారీ యజమాని మహిళలు అని చూడకుండా తమ కుటుంబ సభ్యులైన నలుగురిపై కోర్టులో కేసు ఎలా వేస్తారని అధికారులను ప్రశ్నించారు. కోర్టులో కేసు నడుస్తుండగా క్వారీ ఎలా నిర్వహిస్తారని బాధితుడు ప్రశ్నించారు. అధికారులు న్యాయం చేయకుంటే తాను హైకోర్టును ఆశ్రయిస్తానని ఉత్తన్న అధికారుల ఎదుట స్పష్టం చేసాడు. అనంతరం అధికారులు గనుల శాఖ నిభంధనల మేరకు పట్టా భూములు ఆక్రమణకు గురయ్యాయా? క్వారీకి ఎన్ని హెక్టార్లకు అనుమతి ఉంది? ఎన్ని హెక్టార్లలో తవ్వకాలు చేపట్టారు? క్వారీ సమీపాన ఎకరం భూమిలో ప్లాంటేషన్ ఏర్పాటు చేశారా? తదితర అంశాలపై స్కూల్ పిల్లలు, ఉపాధ్యాయులతో చర్చించారు. జాయింట్ టీంలో పాల్గొన్న అన్ని శాఖల సమగ్రమైన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని స్పష్టం చేసారు.



క్వారీ వద్ద జాయింట్ టీం అధికారుల విచారణ

గర్భిణిని చేసి.. ఒంటరిగా వదిలేసి

- అనాథను మోసం చేసిన యువకుడు
- న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు
- యువతికి బాసటగా బాస్ నాయకులు

పెద్దతిప్పసముద్రం : పెళ్లై ఒక కుమారుడికి జన్మనిచ్చిన అనంతరం కట్టుకున్నవాడు అకాల మరణం చెందాడు. ఫోన్ ద్వారా పరిచయమైన మరో వివాహితుడు తనకు పెళ్లి కాలేదని వితంతు ఆ యువతిని నమ్మించి గర్భవతిని చేశాక ముఖం చాటేసాడు. కన్న వాళ్లు ఎవరూ లేని అనాథ యువతి బోరున విలపిస్తుంటే బాస్ నాయకులు ఆమెకు అండగా నిలిచారు. ఆత్మస్థైర్యం నింపి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

బాధితురాలి కథనం మేరకు.. కురబలకోట మండలం రిషివ్యాలీకి చెందిన పసుపులేటి పావనికి సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన వినోద్‌కుమార్‌తో 2016లో వివాహమైంది. ఈ దంపతులకు ఏడేళ్ల వయసున్న కుమారుడు ఉండగా, 2021లో భర్త అకాల మరణం చెందారు. దీంతో పావని స్వగ్రామంలో నివాసముంటోంది. తన అక్క కుమార్తెకు ఆపరేషన్ కావడంతో మదనపల్లిలోని ఓ ఆసుపత్రిలో ఆమెకు సహాయకురాలిగా పావని ఉండేది. అదే ఆసుపత్రిలో మండలంలోని టి.సదుంకు చెందిన జయమ్మ కాలు ఆపరేషన్ కోసం రాగా, ఆమె కుమారుడు పోతగాని శ్రీకాంత్(32)తో ఫోన్‌లో పావనికి పరిచయం ఏర్పడింది. అతడికి వివాహమై భార్య, ఇద్దరు పిల్లలున్నారనే విషయాన్ని దాచిపెట్టి వితంతు యువతి అయిన పావనిని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. 2023లో సత్యసాయి జిల్లా కదిరిలో కాపురం పెట్టాడు. ఈ తరుణంలో తాను గర్భం దాల్చిన విషయాన్ని చెప్పగా అబార్షన్ చేయించు కోమని పావనిపై ఒత్తిడి తెచ్చాడు. మదనపల్లిలోని అన్ని ఆసుపత్రులు తిప్పినా డాక్టర్లు అబార్షన్‌కు నిరాకరించడంతో.. పావనిని ఎలాగైనా వదిలించుకోవాలని భావించిన శ్రీకాంత్ కర్నాటక రాష్ట్రం చింతామణిలో వదిలేసి వెళ్లిపోయాడు. అష్టకష్టాలు పడి మండల కేంద్రానికి చేరుకున్న పావని ఆరు నెలల కడుపుతో దిగాలుగా ఏడుస్తుంటే బాస్ నాయకులు కేవీ రమణ, సింగన్నలు జరిగిన విషయాన్ని తెలుసుకుని ఆమెకు బాసటగా నిలిచారు. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడిని అరెస్టు చేసి పావనికి న్యాయం చేయాలని కోరారు.

కమల్ హాసన్‌ను కలిసిన ఎంపీ మేడా



రాజంపేట : సినీ నటుడు కమల్ హాసన్‌ను ఎంపీ మేడా రఘునాథరెడ్డి భేటీ అయ్యారు. శుక్రవారం పార్లమెంట్‌లో డీఎంకే పార్టీ తరఫున కమల్ హాసన్ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంటు ప్రాంగణంలో కమల్ హాసన్‌ను ఎంపీ కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ విషయంను రాజ్యసభ సభ్యుడు మేడా తెలియచేశారు. ఈయతోపాటు పలువురు రాజ్యసభ సభ్యులు, ఎంపీలు ఉన్నారు.

కళ్లు ఎంతో ప్రధానమైనవి

రాజంపేట రూరల్ : మానవ శరీరంలో కళ్లు ఎంతో ప్రధానమైనవని ఏపీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామసుబ్బారెడ్డి, ఏఎస్పీ మనోజ్‌రామనాథ్ హెగ్డే అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జాతీయ రహదారిలెపి డాక్టర్ అరవింద్ కంటి వైద్యశాలలో వర్కింగ్ జర్నలిస్టులకు శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అనంతరం వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేసే జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచితంగా కంటి, డయాబెటీస్ పరీక్షలు నిర్వహించిన డాక్టర్ అరవింద్ అభినందనీయుడని కొనియాడారు. ఇదే విదంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఏపీయుడబ్ల్యూజే నాయకులకు సూచించారు. డాక్టర్ అరవింద్ ఉచితంగా అందజేసిన కళ్లద్దాలను అతిథులు జర్నలిస్టులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు క్రిష్ణయ్య, ఉపాధ్యక్షులు బచోటి బాస్కర్, ఇండ్లూరి చిన్న వేంకటరెడ్డి, శివశంకర్, మలిశెట్టి సుబ్బనరసింహులు, మందా శివయ్య, శివయ్యనాయుడు, బాలిపోగు సునీల్, మండ్ల శ్రీహరీ, నరసింహ, నాగేంద్రప్రసాద్, రవి, కల్యాణ్, మధుసూదన్, చామంచి వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు కంటి అద్దాలు అందజేస్తున్న ఏఎస్పీ మనోజ్‌రామనాథ్ హెగ్డే

చిన్నాన్న కుటుంబంపై టీడీపీ నాయకుడి దౌర్జన్యం

- కౌలుకు ఇచ్చిన భూమి తనదేనంటూ రుబాబు
- లోకేష్, ఎమ్మెల్యే, ఎస్పీకి ఫిర్యాదుచేసినా ఫలితం శూన్యం



తండ్రి కృష్ణప్పతో కలిసి ఆవేదన వ్యక్తం చేస్తున్న కుమార్తెలు

మదనపల్లె రూరల్ : కౌలుకు ఇచ్చిన సొంత చిన్నాన్న భూమిని ఆక్రమించుకోవడమేగాక... ఆ భూమి తనదేనంటూ చిన్నాన్న, చెల్లెళ్లపై దౌర్జన్యం చేసిన టీడీపీ నాయకుడి ఉదంతం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో బాధితులు రామసముద్రం మండల టీడీపీ నాయకులు, పుంగనూరు రూరల్ టీడీపీ పరిశీలకులు గజ్జల శీతప్ప...తమకు చేసిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ బలిజపల్లెకు చెందిన గజ్జల కృష్ణప్పకు, వేర్వేరు సర్వే నెంబర్లలో 2.5 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఇతడికి భార్య నారాయణమ్మ, ముగ్గురు కుమార్తెలు మహేశ్వరి, మంజుల, సావిత్రి ఉన్నారు. పదేళ్ల క్రితం గజ్జల కృష్ణప్ప, భార్య నారాయణమ్మ స్వగ్రామం మదనపల్లె మండలం కొత్తవారిపల్లెకు ఇల్లరికం వెళ్లాడు. ఈ క్రమంలో తన పేరుమీద ఉన్న పొలాన్ని, తన అన్న గజ్జల వెంకటరమణ.. అతడి కుమారుడు, టీడీపీ నాయకుడు గజ్జల శీతప్ప కౌలుకు చేసుకోవాలని, తాను కోరినప్పుడు స్వాధీనం చేయాలని గజ్జల కృష్ణప్ప చెప్పాడు. అప్పటినుంచి పొలాన్ని గజ్జల వెంకటరమణ, శీతప్ప సాగుచేసుకుంటున్నారు. రెండేళ్ల కిందట కృష్ణప్ప గుండె జబ్బుకు లోనై అనారోగ్యం పాలవడంతో కుమార్తెలతో కలిసి స్వగ్రామానికి వెళ్లాడు. తన పొలమం ఇవ్వాలని కోరగా.. కృష్ణప్ప, అతడి కుమార్తెలను పొలంలోకి రానివ్వకుండా వెంకటరమణ, శీతప్ప అడ్డుకున్నారు. పొలం తమ ఆధీనంలో ఉందని, నీకు సంబంధం లేదని, దిక్కున్న చోటు చెప్పుకోవాలంటూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. కృష్ణప్ప, ముగ్గురు కుమార్తెలు..భూరికార్డులు పట్టుకుని రెవెన్యూ అధికారులను కలిసి విన్నవించినా రాజకీయ పలుకుబడి కారణంగా తామేమీ చేయలేమని చేతులెత్తేశారు. దీంతో బాధితులు స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ కార్యాలయాల్లో తమ సమస్యపై అర్జీ అందజేశారు. అమరావతిలోని ప్రజాదర్బార్‌లో ఫిర్యాదుచేస్తే, వారు స్థానిక రెవెన్యూ అధికారులకు రెఫర్ చేశారని, వారు రికార్డులు మీపేరు మీదే ఉన్నాయి. పొలంలోకి వెళ్లండని సూచించారన్నారు. పొలంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే శీతప్ప మరోసారి దాడి చేశాడని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే తామేమీ సహాయం చేయలేమని చేతులెత్తేశారన్నారు. శీతప్ప రాజకీయ పలుకుబడి, అధికారం అండను చూసి అధికారులు సైతం భయపడుతున్నారని, తమకు న్యాయం జరగకపోతే చావే శరణ్యమంటూ తండ్రీ, కుమార్తెలు కన్నీటి పర్యంతమయ్యారు. కూటమిప్రభుత్వంలో ఆడపిల్లల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, సీఎం, డిప్యూటీ సీఎం, నారాలోకేష్‌లు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆలయ పనులను నాణ్యతగా చేపట్టాలి

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామంలో వెలసిన మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని పురావస్తు శాఖ ఏడీ రజిత కాంట్రాక్టర్‌కు సూచించారు. శుక్రవారం ఆమె మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆమె వెంట తిమ్మారెడ్డి, కాంట్రాక్టర్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

నవ వధువు ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పెళ్లైన మూడు రోజులకే నవ వధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రొద్దుటూరులో చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసుల వివరాల మేరకు.. కొర్రపాడు రోడ్డులోని భగత్‌సింగ్‌కాలనీ రెండో వీధికి చెందిన గౌస్‌బాషా కొన్నేళ్ల నుంచి కువైట్‌లో ఉంటున్నాడు. ఆయన కుమార్తె మహబూబ్‌చాంద్‌ను(18) మైదుకూరు మండలంలోని చౌటపల్లెకు చెందిన దావూద్ హుసేన్ పీర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. 24న ఉదయం భర్త దావూద్ హుసేన్‌పీర్ పని ఉందని చెప్పి మైదుకూరు రోడ్డుకు వెళ్లాడు. కొంత సేపటి తర్వాత ఇంట్లోకి వెళ్లిన మహబూబ్‌చాంద్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. ఆమె తల్లి ఫైరోజ్ బెడ్‌రూం వద్దకు వెళ్లి పిలవగా కుమార్తె పలకలేదు. బంధువులు తలుపులు పగలగొట్టి చూడగా ఉరేసుకుంది. కాగా మహబూబ్‌చాంద్‌కు ఇష్టం లేని పెళ్లి చేయడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌చాంద్ కొన్నేళ్ల నుంచి కడుపు నొప్పితో బాధపడుతోందని, చాలా హాస్పిటళ్లలో చూపించినా నయం కాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

మైనర్ బాలిక కేసు దర్యాప్తు దశలో ఏమీ చెప్పలేం

కడప అర్బన్: గండికోటలో మైనర్ బాలిక హత్య కేసు దర్యాప్తు దశలో ఏమీ చెప్పలేమని, కేసును వీలైనంత తొందరగా ఛేదిస్తామని డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ గండికోట మైనర్ బాలిక కేసు కాస్త సమయం పడుతుందని, సెల్ టవర్ ఆధారంగా 350 మందిని గుర్తించామన్నారు. అదే రోజు పక్కనే ఉన్న గ్రామంలో ఒక జాతర జరిగిందన్నారు. రెండు సెల్ టవర్లు ఒకే ప్రాంతంలో ఉండడంతో ఆ ప్రాంతంలో 300 మందిని విచారించామని, మిగిలిన 50 మందిని విచారించాల్సి ఉందన్నారు. గత పది రోజులుగా 10 మంది అధికారులు అదే కేసుపై సీరియస్‌గా ఉన్నారన్నారు. గండికోట ప్రాంతంలో మైనర్ పిల్లలకు గదులు ఇవ్వకుండా పకడ్బందీగా చెప్పడం జరిగిందన్నారు. టూరిస్ట్ ఔట్ పోస్ట్ లో తనిఖీలు కంటిన్యూగా ఉంటాయన్నారు. మైనర్లు ఒంటరిగా గండికోట ప్రాంతానికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

గాడి తప్పిన వైవీయూ పాలన

- రెగ్యులర్ అధికారి లేక ఇష్టారాజ్యం
- మహిళా అధ్యాపకుల మధ్య దూషణల పర్వం
- ఒకరిపై ఒకరు అధికారులకు ఫిర్యాదులు



యోగివేమన విశ్వ విద్యాలయ ముఖచిత్రం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన విశ్వవిద్యాలయాలకు తలమానికంగా నిలుస్తూ వచ్చిన యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రతిష్ట మసకబారేలా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏడాది పూర్తయినా రెగ్యులర్ వైస్ ఛాన్సలర్, రెగ్యులర్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో పాలన గాడితప్పింది. దీంతో విశ్వ విద్యాలయంలో గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి. అధ్యాపకులు పని లేక ఒకరిపై ఒకరు దూషణల పర్వం కొనసాగిస్తూ విశ్వ విద్యాలయ ప్రతిష్టను మంటకలుపుతున్నారు. మరోవైపు చిరుద్యోగులకు వేతనాలు అందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా 2006 మార్చిలో పురుడు పోసుకున్న యోగి వేమన విశ్వ విద్యాలయం అనతి కాలంలోనే అద్భుతమైన ఫలితాలను సాధిస్తూ ఖ్యాతి అర్జించింది. న్యాక్ ఎ గ్రేడ్ సాధించడంతోపాటు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్‌లో టాప్100లో నిలిచింది. ఇంతటి ప్రతిష్ట కలిగిన విశ్వ విద్యాలయానికి రెగ్యులర్ అధికారులను నియమించకపోవడంతో పాలన గాడి తప్పి ఇష్టారాజ్యంగా తయారైంది. గత ఏడాది రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బలవంతంగా రాజీనామా చేయించిన సంగతి తెలిసింది. అనంతరం ఆచార్య పణితి ప్రకాష్‌బాబును ప్రభుత్వం నియమించినా మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. అప్పటి నుంచి రెగ్యులర్ వైస్ ఛాన్సలర్, రెగ్యులర్ రిజిస్ట్రార్లు లేక పాలన పూర్తిస్థాయిలో గాడి తప్పింది. తాజాగా విశ్వ విద్యాలయంలోని ఓ ఆర్ట్స్ విభాగంలో ఇద్దరు మహిళా ఆచార్యులు మధ్య దూషణల పర్వం జరగడమేగాక ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకునే దాకా వెళ్లింది. ఆచార్యలమన్న స్థాయి మరిచి వర్ణించలేని పదాలతో దూషణకు దిగడంతోపాటు ప్రిన్సిపాళ్లకు ఫిర్యాదుల మోత మోగించినట్లు తెలిసింది. కొందరు సంఘాల నాయకులు ఇరువర్గాలకు వత్తాసు పలుకుతూ మరోవైపు రాజీ కార్యక్రమాలకు పాల్పడుతూ బోధనను గాలికి వదిలి రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్నట్లు చర్చ సాగుతోంది. దీంతోపాటు సైన్సు విభాగానికి చెందిన ఒక యువ అచార్యుడిపై గతంలో వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం కమిటీ విచారణను చేపట్టింది. మరో వైపు చిరుద్యోగులకు వేతనాలు అందించడంలో మీన మేషాలు లెక్కిస్తున్నారు. జులై 25వతేదీ వస్తున్నా జూన్ నెల వేతనాలు వేయకపోవడంతో చిరుద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతోపాటు విశ్వవిద్యాలయంలో సక్రమంగా సమయపాలన పాటించడం లేదు. అన్ని శాఖలో బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిజేషన్ విధానం అములు చేస్తుండగా.. వైవీయూలో మాత్రం లేకపోవడంతో ఆచార్యులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది చర్చ సాగుతోంది. వైవీయూలో దాదాపు పది విభాగాల్లో విద్యార్థులు లేకపోవడంతో లక్షల్లో వేతనాలు తీసుకునే అచార్యులు ఖాళీగా కూర్చొంటున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. న్యాయ కళాశాలలు, బీఈడీ కళాశాలల్లో అవినీతి బాగోతాలను విద్యార్థి సంఘాలు ఎత్తి చూపుతుండడంతో విశ్వవిద్యాలయం అట్టుడకుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెగ్యుర్ అధికారులను నియమించి విశ్వ విద్యాలయ ఖ్యాతిని కాపాడాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసులు వివరణ కోరగా కెమిస్ట్రీ అచార్యుడిపై గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు కమిటీ వేసి విచారణ చేయించామన్నారు. దీంతో పాటు ఆర్ట్స్ విభాగంలో మహిళా అచార్యులు దూషణల పర్వంపై మాట్లాడగా నాకు సమాచారం తెలిసింది...విచారిస్తామన్నారు. కిందిస్థాయి ఉద్యోగుల జీతాల విషయమై మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్ తక్కువగా ఇస్తుందని దీంతో వన్‌బై జీతాలను ఇస్తున్నామని తెలిపారు.